క్లుప్తంగా

రక్షణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు


శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం: క్రీస్తునందు భయభక్తులు కలిగి జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు ఘనంగా పరిశుద్ధ శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అదే జ్ఞానానికి మూలమని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో సూచించబడిందన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలందుకున్న కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ సేవలో 20 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల దంపతులను అనుమతించనున్నట్టు ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 8985515989 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణపై అవగాహన

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. మహారాణిపేట వద్ద మొదలైన ర్యాలీ జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రం వరకు జరిగింది. ఈనెల 1వ తేదీన మొదలై 8వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే అంశంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్. జీవన్‌రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న గాయకుడు అనుజ్

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వి.గౌరీ రామమోహన్ శిష్యుడు అనుజ్ తన అద్భుత గాత్రంతో త్యాగరాజ, జయదేవ, తులసీదాస్ కృతులు, కీర్తనలు ఆలపించి అలరించాడు. శ్రీవిఘ్నరాజ, నాద తనుమనిషం, సరస్వతీ నమోస్తుతే, దుర్గాదేవి, జయ జయ వైష్ణవి, నాథ హరే, జయ జగత్ జనని కీర్తనలు భక్తులను సమ్మోహనపర్చాయి. ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.సాయిచంద్రశేఖర్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయకుడు అనుజ్‌ను అభినందించారు.

హమ్మయ్య.. మరమ్మతు చేశారు

- ఎట్టకేలకు జీవీఎంసీ జోన్-4 కార్యాలయం లిఫ్ట్‌లకు రిపేర్
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు జీవీఎంసీ సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో రెండవ లిఫ్ట్‌కు కూడా మోక్షం కలిగింది. ఇక్కడ నాలుగు అంతస్తుల్లో జోనల్ కమిషనర్, రెవెన్యూ, జీవీఎంసీ ఫైర్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, పబ్లిక్ హెల్త్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగం ఉన్నాయి. దీంతో పలు పనుల నిమిత్తం ఈ కార్యాలయానికి ప్రతిరోజూ ఎంతో మంది ప్రజలు వస్తూ ఉంటారు. ఇక సిబ్బంది సంగతి సరేసరి. వీరి అవసరాల కోసం ఇక్కడ రెండు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. అయితే కొన్నాళ్ల తర్వాత అందులో ఒకటి పాడై మూలకు చేరింది. కార్యాలయ ఉద్యోగులు, అధికారులతో పాటు ఇక్కడికి వివిధ అవసరాల కోసం వచ్చే వారి తాకిడి ఎక్కువగా ఉండడంతో పని చేస్తున్న లిఫ్ట్ కూడా తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో ఇక్కడికి వచ్చే వికలాంగులు, వృద్ధులు, పిల్లలు మెట్లెక్కి నాలుగు అంతస్తుల కార్యాలయానికి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'సాక్షి'లో ప్రత్యేక కథనం వెలువడడంతో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి కొన్నేళ్లుగా మూలకు చేరుకున్న రెండవ లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఇప్పుడు కార్యాలయానికి చెందిన రెండు లిఫ్ట్‌లు అందుబాటులోకి రావడంతో వృద్ధులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాలుగంతస్తుల జీవీఎంసీ జోన్-4 కార్యాలయం

'ముస్లింలను మోసం చేయడానికి లోకేష్ మరో ప్రయత్నం'


కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

దాబాగార్డెన్స్: టీడీపీ నాయకుడు నారా లోకేష్ ముస్లింలను మళ్లీ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఉత్తరాంధ్ర మైనారిటీ నాయకుడు, కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ తెలిపారు. చంద్రగిరిలో శుక్రవారం నారా లోకేష్ నిర్వహించిన ముస్లిం సమావేశంలో మైనారిటీలకు ఇస్లామిక్ బ్యాంక్ హామీ ఇవ్వడం హాస్యాస్పదమని ఒక ప్రకటనలో తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేష్ ఎమ్మెల్సీగా ఉంటూ మంత్రి పదవి పొందారన్నారు. కానీ మైనారిటీలకు మాత్రం ఎవ్వరికీ అప్పట్లో మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. అలాంటి టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు ముస్లింలకు ఎలా న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. లోకేష్ మాటలు రాష్ట్రంలో ఏ ముస్లిం మైనారిటీ వ్యక్తి కూడా నమ్మరన్నారు. లోకేష్ యువ గళాన్ని పప్పు గళంగా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఇలాంటి పప్పు లోకేష్ మాటలు ముస్లింలు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. హజ్ యాత్రకు వెళ్లిన ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.30 వేలు, రూ.60 వేలు చొప్పున ఇస్తుందన్నారు. దీంతో పాటు ముస్లిం మైనారిటీలకు సబ్ ప్లాన్ కూడా తెచ్చిందన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎం త్రినాథరావు, కార్యదర్శి వి. వల్లీకుమారి, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, చెన్నా తిరుమలరావు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వైద్య శిబిరంలో షుగర్, బీపీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులచే ఈ ఉచిత వైద్య శిబిరం, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9395111133 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంతోష్

కంచరపాలెం: పదో తరగతి విద్యార్థులు నిపుణులను కలవడం, స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులు అభ్యసించడం, వాస్తవ స్థితిగతులను తెలుసుకోవడం ద్వారానే కెరీర్ గైడెన్స్‌ను ఎంచుకోవచ్చని ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ పుల్లేటికుర్తి సంతోష్ అన్నారు. చైల్డ్ రైట్స్ అండ్ యూ, ధరణి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెస్త్ తరువాత విభిన్న అవకాశాలు, సాంకేతిక అవకాశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటేశ్వరరావు, ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి పాల్గొన్నారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పిస్తారు.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు


అభిషేకం అనంతరం అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద 14 గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, ఎస్‌బీజీ నగర్, రవీంద్రనగర్ తదితర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ నెల 7న జరగనున్న అమ్మవారి జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం


సీతంరాజు సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు


ప్రచారం చేస్తున్న బత్తిన నవీన్‌కుమార్


కల్లుపాకలు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన శాసనమండలి సభ్యుడు సీతంరాజు సుధాకర్‌ను గెలిపించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం 27, 33 వార్డుల్లో గడప గడపకు తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే 27వ వార్డులో దొండపర్తి సచివాయం, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, రామాలయం, అశోక్‌నగర్, ఆశీలమెట్ట ప్రాంతాల్లో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, జీసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, 27వ వార్డు ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, అజయ్‌రెడ్డి, మధు, శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో కొబ్బరితోట, యాతపేట ప్రాంతాల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వార్డు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దానయ్యమ్మ, అప్పలరాజు, గరికిన ధన, వైట్, నాగమణి, కనకరాజు, లావణ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్లుపాకల్లో..

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం కల్లుపాకల్లో పట్టభద్రుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల సమస్యలు సీతంరాజు సుధాకర్‌తోనే పరిష్కారం అవుతాయన్నారు.

31వ వార్డులో..

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ 31వ వార్డు నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ శుక్రవారం వార్డు పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నక్కా వేణు, జితేంద్ర, సీహెచ్ శంకరరావు, దొడ్డి త్రిమూర్తులు, బత్తిన మణికంఠ, ఆర్జి రాజేష్, శ్రీను, ఎండీ వల్లీ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహగిరిపై కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపై ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు.

ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు పూజ నిర్వహించగా ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం కమనీయంగా జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులు తదితరులు ఈసేవ నిర్వహించారు.

ఏకాదశి పురస్కరించుకుని ఆలయ కల్యాణ మండపంలో పండితులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.

విశేషంగా తిరువీధి

ఏకాదశి పురస్కరిచుకుని సింహగిరిపై తిరువీధి విశేషంగా జరిగింది. మధనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

వినికిడి సమస్యలున్న పిల్లలకు వైద్య సేవలు


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : వినికిడిసమస్యలున్న పిల్లలకు అవసరమైన వైద్య సేవలు కేజీహెచ్‌లో అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ వినికిడి దినోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో గత ఏడు సంవత్సరాల్లో 70 మంది పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు జరిగాయన్నారు. అలాగే 116 మంది పిల్లలకు హియరింగ్ ఎయిడ్స్ పరికరాలు అందించామన్నారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి మాట్లాడుతూ స్పీచ్ థెరపీ ద్వారా ఎందరో పిల్లలు లబ్ధి పొందారని తెలిపారు. జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ పుట్టుక నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలు, ఎదుగుదల లోపాలను గుర్తించి తగిన చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్ పి.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం


సిరిపురం వద్ద రహదారులను శుభ్రం చేయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: నగరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరుగుతున్న నేపథ్యంలో రహదారులన్నింటినీ పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ కె.శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన జోన్ పరిధిలో గల 12 వార్డుల్లో పర్యటించి సిరిపురం, బీచ్‌రోడ్డు ప్రధాన రహదారులను పరిశుభ్రం చేయించారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగకుండా చూసుకునే బాధ్యత పారిశుధ్య కార్మికులదే అన్నారు. ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలన్నారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగి రహదారులపై ప్రవహించకుండా ముందుగానే మరమ్మతులు చేయించాలన్నారు. డివైడర్ల వద్ద మట్టి లేకుండా శుభ్రం చేయాలన్నారు. హార్టీకల్చర్ అధికారులు డివైడర్ల మధ్యలోని మొక్కల సంరక్షణ పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో ఎస్.కిశోర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- జోన్-3లో 10 కేంద్రాల ఏర్పాటు
- బయోమెట్రిక్, చిరునామా వివరాల అప్‌డేషన్‌కు అవకాశం


దొండపర్తి 143 సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న కార్యదర్శి

సీతంపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన వారు బయోమెట్రిక్, చిరునామా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల సమాచారం తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 10 వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవలు పొందవచ్చు. దొండపర్తి నెహ్రూ బజార్ రోడ్డులోని 143 సచివాలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రంలో ఎప్పుడైనా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవచ్చు.

జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఆధార్ కేంద్రాల వివరాలు

సంఖ్య	సచివాలయం కోడ్	సచివాలయం పేరు	సెక్రటరీ పేరు	ఫోన్ నంబర్
1.	1086117	మద్దిలపాలెం-03	బోయిన నాగేశ్వరరావు	95422 66611
2.	1086110	రజక వీధి-01	ఉప్పాడ ఆదిసోంబాబు	94940 82506
3.	1086163	రెల్లిపేట కాలనీ	పిడింట్ల సాయికుమార్	70134 26964
4.	1086125	లలితానగర్	గేది యమున	74164 90464
5.	1086154	ఇందిరానగర్-03	దన్నిన అనిల్‌కుమార్	97039 50500
6.	1086106	న్యూవెంకోజీపాలెం-02	శిరిషా యలమంచిలి	99663 42176
7.	1086150	బాలాజీనగర్-04	గొలగాని రాఘవేంద్ర	70369 33013
8.	1086143	దొండపర్తి-02	గౌరి పైలా	83176 04549
9.	1086138	పాత రేసపువానిపాలెం	డెక్కల లోవరాజు	91334 19363
10.	1086149	పిఠాపురం కాలనీ	పెద్దింటి హరిత	99488 85933

మహిళా రైతు నిజాయితీ

రైతుబజార్‌లో దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత


వినియోగదారుడు గోపీకి సెల్‌ఫోన్ అందిస్తున్న రైతు అచ్చియ్యమ్మ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌కు చెందిన ఓ మహిళా రైతు తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను సంబంధిత వ్యక్తికి అందించి నిజాయితీని చాటుకున్నారు. వివరాలిలా.. డాబాగార్డెన్స్‌కు చెందిన గోపీ అనే వినియోగదారుడు శుక్రవారం సీతమ్మధార రైతుబజార్‌కు వచ్చాడు. రూ.15 వేల విలువ చేసే తన సెల్‌ఫోన్‌ను ఒక స్టాల్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. అది గమనించిన రైతు వ్యాపారి అచ్చియ్యమ్మ మొబైల్ ఫోన్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు అందజేశారు. వినియోగదారుడు గోపీకి సమాచారమిచ్చి పోగొట్టుకున్న ఫోన్‌ను ఆమె చేతుల మీదుగా ఈవో అప్పగించారు. అచ్చియ్యమ్మ నిజాయితీని మెచ్చుకుని పలువురు అభినందించారు.

భూకబ్జాదారులుగా చిత్రీకరిస్తున్నారు

- ఎమ్మెల్యే వాసుపల్లి ఎదుట వెంకటేశ్వరమెట్ట వాసుల ఆవేదన

అల్లిపురం: తమను భూకబ్జాదారులుగా దేవదాయ శాఖ అధికారులు చిత్రీకరిస్తున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరమెట్ట వాసులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం వెంకటేశ్వర మెట్టపై ప్రచారం చేస్తూ వెంకట గౌరీ శంకర గ్రంథాలయానికి చేరుకున్నారు. గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీనుతో పాటు సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, వెంకటేశ్వరమెట్ట నివాసితుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు తమ సమస్య వివరించారు. శతాబ్దకాలంగా వెంకటేశ్వరమెట్టపై తమ పూర్వీకులు ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారని, వారు 60వ దశకంలో వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని కట్టుకున్నారన్నారు. 1971లో దేవాదాయ శాఖకు దేవాలయాన్ని అప్పగించారని తెలిపారు. కానీ దేవదాయ శాఖ అధికారులు 1450 సర్వే నంబరులో గల ఇళ్ల యజమానులతో పాటు వెంకట గౌరీ శంకర గ్రంథాలయానికి కూడా ఇటీవల నోటీసులు జారీ చేశారన్నారు. వేలాది రూపాయలు బకాయిలున్నారంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వాసుపల్లి వారికి హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్దిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్-4లో ఈ నెల 4న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్ వీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్‌లోని సెబ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.